క్లుప్తంగా

నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలి



విజయవాడ కల్చరల్: నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. శ్రీధర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై మంగళవారం 'ప్రేమకు పరాకాష్ట' అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం నాటకం నాడు సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను ప్రస్తావిస్తూ రాసినట్లు గుర్తుచేశారు. కంఠాభరణం, వరవిక్రయం, మా భూమి లాంటి నాటికలు సామాజిక సమస్యలతో సాగాయని చెప్పారు. సమాజంలో ప్రేమ రాహిత్య మనుషులు కనిపిస్తూ ఉంటారని.. వారికి ప్రేమను పంచి సమాజంలో మనుషులుగా గుర్తించాలనే సందేశంతో నాటకం సాగుతుంది. నాటకంలో నటించిన మోహన్, మనుప్రియ, రమేష్ గౌడ్‌ను వేముల హజరత్తయ్యగుప్తా, నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

నాణ్యత ప్రమాణాల్లో లోపం లేకుండా చూడాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు లేకుండా అధికారులు నిరంతర నిఘా ఉంచాలని వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సర్కిల్–2 పరిధిలోని జరిగే అభివృద్ధి పనులపై ఆయన ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరదలు తర్వాత దెబ్బతిన్న రోడ్లను త్వరితగతిన మరమ్మతులు చేసి, ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్లకు మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 28వ డివిజన్ భానూనగర్ రోడ్డు, 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీ, పసుపుతోట వీవీనరసరాజు రోడ్డుతో పాటు బీఆర్టీఎస్ రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు జరుగుతున్నాయి. గుంతల్లో తారు పోసి పూడుస్తున్నారు. అయోధ్యనగర్‌లో రోడ్డు పనులను కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న అష్టావధానం



విజయవాడ కల్చరల్: మొగల్రాజపురంలోని పర్వతేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ మేడసాని మోహన్ నిర్వహించిన అష్టావధానం ఆద్యంతం ఆకట్టుకుంది. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పృచ్ఛకులుగా పాల్గొనడం విశేషం. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ (నిషిద్ధాక్షరి), డాక్టర్ గుమ్మా సాంబశివరావు (నస్తాక్షరి), డాక్టర్ జె.వి. చలపతిరావు (దత్తపది), డాక్టర్ పింగళి వెంకట కృష్ణారావు (సమస్యపూరణం), డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ (వర్ణన), డాక్టర్ కప్పగంతు రామకృష్ణ (అప్రస్తుత ప్రసంగం), వలివేటి శివరామకృష్ణమూర్తి (కావ్యపురాణం), ధీరజ్, మోహన, ఎలిజిబత్ రాణి, భువనేష్ ఆశువు అంశాలను సమర్థంగా నిర్వహించారు. కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీనివాస్, తెలుగు శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు. నిర్వాహకులు పృచ్ఛకులను ఆత్మీయంగా సత్కరించారు.

నేడు విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం

విజయవాడ రూరల్: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.బిగ్గిన్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు శాఖాపరమైన నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే..

- బుడమేరులోకి పడిపోతున్న వాహనదారులు
- ప్రమాదకరంగా వైఎస్సార్ రోడ్డు మార్జిన్లు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా వ్యర్థాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే రామకృష్ణాపురం, జీవీఆర్‌నగర్ గుణదల డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో మార్జిన్లు సరిగా లేకపోవడంతో వాహనచోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. కొన్నిసార్లు వాహనాలు బుడమేరులోకి పడిపోతున్నాయి. అంతేకాకుండా ఈ రోడ్డు మార్గం డంపింగ్ కేంద్రంగా మారింది. ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ, సెప్టిక్ వ్యర్థాలతో పాటు చెత్త చెదారం వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారడంతో పాటు రోడ్డు మార్జిన్లు కుచించుకుపోయి మార్జిన్ దిగేందుకు సైతం వీలులేకుండా అయిపోతుంది. చెత్త చెదారం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాల వల్ల మేకులు, రాళ్లు రోడ్లపైకి చేరుకుని వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు.

వ్యర్థాలన్నీ రోడ్డుపైనే

సెప్టిక్ వ్యర్థాల వల్ల అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మధురానగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వాటర్ పైపులైన్ పనుల కోసం తవ్విన రోడ్డు వ్యర్థాలు, జీవీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మురుగుకాలువ కోసం తవ్విన వ్యర్థాలను ఇక్కడ ఇష్టారాజ్యంగా వేస్తున్నారు.

బుడమేరులోకి దూసుకువెళ్లిన కారు

ఇటీవల దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం సమీపంలో కారు బుడమేరులోకి దూసుకువెళ్లింది. ఇక్కడ బుడమేరు మధ్యకట్టకు చెందిన వ్యక్తి కారు రివర్స్ చేస్తున్నప్పుడు రోడ్డు మార్జిన్లు సరిగా లేకపోవడంతో బుడమేరులోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో ఒక ద్విచక్రవాహన చోదకుడు, కారు నడుపుతున్న వ్యక్తి, మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ఉదయం పూట ప్రమాదం జరిగింది కాబట్టి స్థానికులు స్పందించి కారులోని వ్యక్తులను బయటకు తీశారు. అదే రాత్రిపూట జరిగితే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్త చెదారం



రోడ్డు మార్జిన్ పక్కనే చెత్తచెదారం

ఇక్కడ రోడ్డు పక్కన చెత్త చెదారం నింపేయడంతో మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వేగంగా వచ్చిన వాహనచోదకులు ఒకవేళ మార్జిన్ దిగితే గుల్లగా ఉండి వాహనాలు బుడమేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కన ఫేవర్లు ఏర్పాటు చేయాలని అప్పుడే రక్షణ ఉంటుందని అంటున్నారు. ప్రతి చిన్న రోడ్డుకు సైతం ఫేవర్లు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్లు ఇక్కడ మాత్రం విశాలంగా నిర్మించిన రోడ్డుకు ఎందుకు ఫేవర్లు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు పక్కనే మట్టి, భవన నిర్మాణ వ్యర్థాలు వేయడంతో వాహనచోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. స్థానికులతో పాటు స్థానికేతరులు సైతం ఇక్కడ వ్యర్థాలను వేస్తున్నారు. ఎవరికి వారు స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడ చెత్తను డంప్ చేస్తున్నారని.. అధికారులు స్పందించి చెత్త చెదారంను తొలగించడంతో పాటు ఫెన్సింగ్‌వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే బుడమేరు పక్కన సుందరీకరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కనే ఉన్న మట్టి కుప్పలు



ఇటీవల బుడమేరులోకి పడిపోయిన కారు (ఫైల్)



ప్రమాదకరంగా మార్జిన్

విద్యార్థులకు పరీక్ష ఫీజు అందజేత



పరీక్ష ఫీజు చెక్కులను అందజేసిన డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని నగరపాలకసంస్థ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ప్రతిఒక్క విద్యార్థికీ పరీక్ష ఫీజును ఆలయ కమిటీ ఆధ్వర్యాన దాతలు, భక్తుల సహకారంతో నిర్విరామంగా చెల్లిస్తామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించేందుకు గానూ స్కూలు ప్రధానోపాధ్యాయులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫీజుల చెల్లింపు కార్యక్రమం 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గంలోని 13 పాఠశాలలకు చెందిన 1,275 విద్యార్థులకుగానూ రూ. 1.59 లక్షలు చెక్కులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. మంచి మార్కులతో విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని గౌతంరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, ఆలయకమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిచేందుకు దారేదీ..



మురుగుకాలువ కోసం మెట్లు తొలగించిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ జీవీఆర్ నగర్ పందిరి రోడ్డులో మురుగుకాలువ పనులు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఇక్కడ గత నాలుగు రోజులుగా మురుగుకాలువ పనులు జరుగుతున్నాయి. కాలువ పనుల కోసం తెచ్చిన సామగ్రి రోడ్డు మధ్యలో వేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు నానాయాతన పడుతున్నారు. అలాగే మురుగు కాలువ పనుల కోసం ఇళ్ల ముందు మెట్లను తొలగించి పెద్ద గోతులు తీశారు. దీంతో ఇంట్లోంచి బయటకు రావాలన్నా, బయటనుంచి ఇంట్లోకి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇళ్లలోకి వెళ్లేందుకు కాంట్రాక్టర్ ఐరన్ గ్రిల్స్ కూడా ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ అదుపుతప్పి గోతుల్లో పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువ పనులు వేగవంతం చేయడంతో పాటు ఇళ్లలోకి వెళ్లేందుకు, రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గార్బేజీ లోడర్ పాయింట్ పరిశీలన



లోడర్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటోందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మార్కెట్, రైతుబజార్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతాయని, వాటి నుంచి నగరవాసులకు ఉపశమనం కలిగించే దిశగా వీఎంసీ చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మంగళవారం సాంబమూర్తిరోడ్డులో వీఎంసీ వినూత్న రీతిలో ఏర్పాటు చేస్తున్న లోడర్‌పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసాంద్రత అధికంగా ఉండే ప్రదేశాల్లో షెడ్లు నిర్మించి లోడర్ బిన్లు ఏర్పాటు చేస్తామన్నారు. దీని వల్ల వ్యర్థాలు బయటకు కన్పించవని, దుర్వాసన కూడా రాదని, లోడర్‌బిన్స్‌లో ఉండే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తామని వివరించారు. ఇలాంటి లోడర్ పాయింట్లను నగరంలోని మూడు సర్కిళ్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో ఆవుల కోసం నిర్మించిన కాటిల్ షెడ్‌ను కమిషనర్ పరిశీలించారు. రోడ్లపై ఆవులు కనిపిస్తే క్యాటిల్ షెడ్‌కు తరలించి, వాటి యజమానులకు భారీ జరిమానా విధించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎమ్మార్ఎఫ్)సెంటర్‌ను పరిశీలించి నిత్యం పొడి చెత్తను వేరు చేసే పని కచ్చితంగా జరిగేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లో వ్యర్థాలను తీసుకొచ్చే డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను పరిశీలించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఇన్‌చార్జ్ వెహికల్ డిపో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసుపాదం, ఇతర సానిటరీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు పని భద్రత కల్పించాలి

సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు దుర్గారావు



ఎక్సెల్‌ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ నాయకులు, క్లాప్ ఆటో డ్రైవర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లందరిని ఆప్కాస్‌లో చేర్చి.. వారికి పని భద్రత కల్పించాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ వద్ద మంగళవారం ఆటోలు ఆపి ఆరో రోజు ధర్నా నిర్వహించారు. క్లాప్ ఆటో యూనియన్ కన్వీనర్ శివ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో దుర్గారావు పాల్గొని ప్రసంగించారు. క్లాప్ ఆటో డ్రైవర్లను ఆప్కాస్ సంస్థలో చేర్చకపోవడం వల్ల వారందరు శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కూడా లేవని కూటమి ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతిబస్సు మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీనే జీతాలు ఇవ్వాలని.. పండుగ సెలవులు, ఆదివారం ఫుల్ డే సెలవులతో పాటుగా రూ. 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నగర కోశాధికారి డి.స్టీఫెన్ బాబు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర సహాయ కార్యదర్శి శీలం దాస్, క్లాప్ ఆటో యూనియన్ కార్మికులు రుద్ర, రామరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): మునిసిపల్ విభాగంలో దీర్ఘకాలంలో ఉద్యోగులు ప్రమోషన్లు లేకుండా ఒకే క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్నారని, వారికి త్వరితగతిన ఉద్యోగోన్నతి కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వరరావు కోరారు. వీఎంసీ ప్రధాన కార్యాయంలో కమిషనర్‌ను ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చామని, వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె.శివరామ ప్రసాద్, ఎ.శ్రీకృష్ణదేవరాయలు, సలీం అహ్మద్, ఓ.రాంబాబు, గుర్రం ప్రకాష్ సాగర్, కె.సురేంద్ర కుమార్, మారుతీరావు, బి.ఉదయ భాస్కర్, కె.శారదారాణి, డి.వెంకటేశ్వరరావు, జయప్రభు, మూర్తి, పి.మధుసూదనరావు, శుభకరరావు, ఓ.కరుణ, ఓ.అహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల బిడ్డ సహా తల్లి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రెండేళ్ల బిడ్డ సహా తల్లి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట బెజ్జాల మేడ సందు ప్రాంతానికి చెందిన యువతి మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. ఒక బాబు పుట్టిన తర్వాత భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేసేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి ఆ యువతి తన రెండేళ్ల బాబును తీసుకుని తన ఆడపడుచు ఇంటికని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల ఆమె కోసం గాలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. స్వాతి సెంటర్‌కు చెందిన ఓ యువకుడి కారణంగానే తన కూతురు అదృశ్యమైందని అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

ఉత్సాహంగా డాన్‌బాస్కో వార్షికోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురునానక్ నగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్ 42వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఉత్సాహంగా జరిగింది. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌కేపీవీవీ విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. సీబీఎస్‌ఈ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కూడా మాతృభాషను నేర్పిస్తూ తెలుగు భాషా సంస్కృతులు, శతకాలు బోధించడం అభినందనీయమన్నారు. స్కూల్ కరస్పాండెంట్ బి.వి.ఎస్.ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల బకాయి బిల్లులు చెల్లించండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన బీఏఐ



బీఏఐ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిపడిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఒక హోటల్లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) సమావేశం మంగళవారం జరిగింది. ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల రుణాల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన యువ కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపి, నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.2 వేల కోట్ల మేరకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్ జనార్దన్ రెడ్డి ఆత్మహత్య వంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడంలో అలస్యం అవుతున్నందున పనులు చేసేటప్పుడు చేసిన అప్పులు, వాటిపై వడ్డీ భారం పెరిగి కాంట్రాక్టర్లు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతున్నారని నాయకులు వివరించారు. కాంట్రాక్టర్ల కష్టాలను గుర్తించి ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఇవ్వాల్సిన బిల్లులను మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డి.పంకజ్ రెడ్డి, వల్లభనేని వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, ఎ.నాగమల్లేశ్వరరావు, సిహెచ్.రామకోటయ్య, పి.రాజబాబు, పలువురు చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా బూదాల సౌమ్య (విజయవాడ ఈస్ట్), వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా చంద్రకిరణ్ తేజ (విజయవాడ ఈస్ట్), లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా చెంగవల్లి సాయిరామ్ (సెంట్రల్), కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా మట్టా నారాయణరావు (సెంట్రల్), పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా మేడా రమేష్ (విజయవాడ సెంట్రల్) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వంలో వైద్యవిద్య నిర్వీర్యం

డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వంలో పేద, వెనుకబడిన విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్యుల విభాగం చైర్మన్ డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వచ్చే ఏడాది కొత్త మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం దరఖాస్తు చేయబోదని ఆరోగ్య మంత్రి ప్రకటించడం సర్వత్రా నిరాశను రేకెత్తించిందన్నారు. ముఖ్యంగా మెడికల్ సీటు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న విద్యార్థులను ఈ నిర్ణయం కృంగదీస్తోందని అన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలకు మరిన్ని అవకాశాలను సృష్టించే దిశగా కృషి చేయడం చాలా అవసరమని పేర్కొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్



విజయవాడస్పోర్ట్స్: పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సులోని దుస్తుల బెల్స్ దొంగిలించిన నిందితులను విజయవాడ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. 45 వేలు విలువైన రెండు బెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ వెంకటేశ్వరరావు, సీఐ అబ్దుల్‌సలాం మంగళవారం వెల్లడించారు. ఆర్టీసీ కార్గో పార్సిల్ కౌంటర్‌లో దుస్తుల బెల్స్ వేసుకుని హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులో గత నెల 19వ తేదీన చోరీ జరిగింది. బస్సు డిక్కీలో ఉన్న రెండు బెల్స్ తీసుకుని కొందరు వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారు. బస్సు డ్రైవర్ గత నెల 23వ తేదీన కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా నరసింహులుపేటకు చెందిన బి. బాలు, బి.హరికృష్ణ, జి.కల్యాణ్, బి.రమేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులపై నరసింహులుపేట, గుంటూరు, ఖమ్మం, నేలకొండపల్లి, కూసుమంచి, మహబూబాబాద్, హనుమకొండ, కాన్పూర్, కేంప్లల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, మర్రిపెడ పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయని చెప్పారు. బస్సులో చోరీ చేసిన బెల్స్‌ను పద్మావతి ఘాట్ వద్ద దాచి, వారి సొంత గ్రామానికి వెళ్లిపోయారని, తిరిగి మంగళవారం నగరానికి చేరుకుని దాచిన వస్తువులను తీస్తుండగా నలుగురిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

దొడ్డిదారిలో ప్రజలపై విద్యుత్ భారాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు దొడ్డిదారిలో భారాలు మోపుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కమ్స్ ప్రతిపాదించిన ఎఆర్‌ఆర్‌పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి విజయవాడలో మంగళవారం విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో అన్ని పనులను అదానికి అప్పగిస్తూ, ఆ రంగాన్ని అదానీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీగా మారుస్తున్నారని విమర్శించారు. ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ వంటి పేర్లతో డిస్కమ్‌లు రూ.వేల కోట్లు వసూలు చేస్తు ఏఆర్‌ఆర్‌లో భారాలు మోపడం లేదని పచ్చి అబద్ధాలు చెబుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రకాల పేర్లతో రూ.72 వేల కోట్లు భారాన్ని కూటమి ప్రభుత్వం వినియోగదారులపై మోపిందన్నారు. ప్రతినెలా 40 పైసలు చొప్పున ముందుగానే డిస్కమ్‌లు వసూలు చేస్తున్నాయన్నారు. దీనిని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. విజయవాడలో రెండు యూనిట్లు వాడిన వినియోగదారునికి రూ.910 బిల్లు వచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి మాటతప్పి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు.